రూ.59 లక్షలతో సీసీరోడ్డు పనులు



పనులను ప్రారంభించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. భ్రమరాంబికానగర్‌లో సుమారు రూ. 59 లక్షలతో చేపట్టిన యూజీడీ, సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో యూజీడీ, తాగునీటి పైపులైన్ పనులు పూర్తైన తర్వాత సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. యూజీడీ పనులకు జలమండలి విభాగం నుంచి నిధులు మంజూరు చేస్తారని, ఇక్కడ పనులు చేపట్టడానికి జీహెచ్ఎంసీ నుంచి నిధులు మంజూరు చేయించామన్నారు. ఏఈ నవీన్, వీఐ రమేష్ కాలనీవాసులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ



ఎంటమాలజీ సిబ్బందితో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం ఎంటమాలజీ విభాగం సిబ్బందితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభంకావడంతో దోమలు పెరిగే అవకాశం ఉందని ఫాగింగ్‌పై దృష్టి సారించాలని సూచించామన్నారు. డివిజన్ పరిధిలోని కాలనీలన్నింటిలో ఫాగింగ్ చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. సూపర్‌వైజర్ నజీర్, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులు తాళలేక..

మహిళ ఆత్మహత్య

కుషాయిగూడ: అదనపు కట్నం వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కుషాయిగూడ శుభోదయ కాలనీలో నివసించే నీల నాగబాబు, మమత (32)లు 11 ఏళ్ల క్రితం ఆర్యసమాజ్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కాగా నాగబాబు డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వారి కాపురంలో అదనపు కట్నం కోసం వేధింపులు మొదలయ్యాయి. కట్నం వేధింపులు తాళలేని మమత విషయాన్ని తన సోదరుడికి చెప్పడంతో రూ.5 లక్షలు బంగారం కట్నంగా ఇచ్చాడు. అప్పటికీ తృప్తి చెందని భర్త తిరిగి భార్యను వేధించసాగాడు. దీంతో మరో రూ.50 వేలు సమకూర్చారు. ఈ విషయంలో మనస్తాపం చెందిన ఆమె తన బెడ్రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అదనపు కట్నం కోసం తరచుగా వేధిస్తున్న భర్త వేధింపులు తాళలేకే తన సోదరి ఆత్మహత్య చేసుకుందని, మృతురాలి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తార్నాకలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ కార్తీకరెడ్డి, శివారెడ్డి తదితరులు





వాణినగర్ విజయవినాయక ఆలయంలో..



సంకటవిమోచన ఆలయంలో..



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

ఆంజనేయం.. మహావీరం

ఘనంగా హనుమ జన్మోత్సవ వేడుకలు

ఉప్పల్: హనుమ జన్మోత్సవం సందర్భంగా పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉప్పల్ అభయాంజనేయస్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆలయ కమిటీ ప్రతినిధులు స్వామివారిని దర్శించుకుని ప్రతేక పూజలు చేశారు.

◆ చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్‌ముదిరాజ్ కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రామంతాపూర్ : శ్రీనగర్ కాలనీలో భక్తాంజనేయ స్వామి ఆలయంలో 21 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహాన్ని గురువారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠాపన చేశారు. సందీప్, ఆనందరావు, వేంకటేశ్వరరావు, యాదగిరిరెడ్డి, రామబ్రహ్మం, పిచ్చయ్య, ఉపేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వరదేవస్థానంలోని సంకటవిమోచన ఆంజనేయస్వామి దేవాలయం, మారుతీనగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. అర్చకులు తులసీరమణాచార్యులు, ముదుంబై వేంకట రమణాచార్యులు, శ్యామ్‌ప్రసాద్‌శర్మలు మూలవిరాట్‌కు అభిషేకం, అలంకరణ, లక్షనాగవల్లీ దళాలతో అర్చన చేశారు. ఈఓ రవీందర్‌రెడ్డి, క్లర్క్ సుధాకర్, హేమంత్‌కుమార్, సంజయ్ పాల్గొన్నారు.

మౌలాలి : డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో హనుమాన్ జన్మోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణ చేపట్టారు. వంశీముదిరాజ్, సాయినాథ్, శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గౌతంనగర్: మల్లికార్జుననగర్ మల్లన్న దేవాలయం, న్యూ మిర్జాలగూడ, సహా పలు దేవాలయాల్లో గురువారం హనుమాన్ జన్మదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ ప్రత్యేక పూజలు చేశారు.

రామంతాపూర్ : శ్రీనివాసపురంలోని కోదండ రామాలయం, నెహ్రూనగర్‌లోని ప్రసన్నాంజనేయాలయం పీఎస్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్ట్ ఫ్యామిలీ మెంబర్ కోట్ల నరసింహారెడ్డి, ఈఓ విజయభారతి, ప్రధాన అర్చకులు తిరుపతాచార్య, శేషాచార్య, సీతారామాచార్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బోడుప్పల్: హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, సత్యనారాయణ, విశ్వంగుప్తా, జంగారెడ్డి, చీరల నరసింహా, యాదగిరి, సుమన్‌నాయక్, జక్కా రాములు తదితరులు పాల్గొన్నారు.

◆ తార్నాక చౌరస్తాలోని లక్ష్మీగణపతి ఆలయంలో జరిగిన కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మేయర్ బండ కార్తీకారెడ్డి హాజరయ్యారు.



ప్రత్యేక పూజల్లో పరమేశ్వర్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు



గౌతంనగర్‌లో కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్



ప్రత్యేక పూజల్లో వజ్రేష్‌యాదవ్, పోగుల నర్సింహారెడ్డి

కార్మికులకు యూనియన్లే కీలకం

మల్లాపూర్: కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వం అవలంభిస్తున్న తీరుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన చేస్తున్నామని 'తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్రజేంటివ్స్ యూనియన్' ప్రధాన కార్యదర్శి భానుకిరణ్ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఫ్రాంకో ఇండియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టామన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ.. కార్మికులకు యూనియన్లు చాలా కీలకమని, హక్కులను కాపాడే సాధనంగా అవి నిలుస్తాయన్నారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కార్మికకోడ్ వల్ల కార్మికుల హక్కులు తుడిచిపెట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్మిక నిర్ణయాలకు వ్యతిరేకంగా అన్ని రంగాల కార్మికులు జూలై 9న నిర్వహించనున్న అఖిల భారత సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభాకర్, దుర్గాప్రసాద్, జగదీశ్వర్‌చారి, సాయిరాం, రాజ్‌కుమార్, విజయ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సేల్స్ రిప్రజేంటివ్స్, సీఐటీయూ నేతలు

భారీ వర్షం.. కాలనీలు జలమయం

రామంతాపూర్ : భారీ వర్షం కారణంగా రామంతాపూర్ డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. టీవీ కాలనీ, శ్రీనివాసపురం, బైపాస్‌రోడ్డు, సాయిచిత్రానగర్ ప్రధాన రహదారి, భారత్ పెట్రోల్ పంపు ఎదురుగా రోడ్లపై నీరు భారీగా నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



రామంతాపూర్‌లో వరద ప్రవాహం

అంధ విద్యార్థులకు చేయూత

మల్కాజిగిరి: సంకల్ప సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆనంద్‌బాగ్‌లోని హోమ్‌లో ఉంటున్న 30 మంది అంధ విద్యార్థులకు గురువారం బెడ్స్, పిల్లోస్‌ను పంపిణీ చేశారు. ఆర్గనైజేషన్ సభ్యులు డాక్టర్ వెంకట్‌రావు, లక్ష్మణ్‌రావు, కల్పన, రజిత, సుప్రియ, బింద్ర పాల్గొన్నారు.



గంజాయి సేవించిన కేసులో నలుగురి రిమాండ్

మల్కాజిగిరి: గంజాయి సేవిస్తున్న నలుగురిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 21న రాత్రి వాణీనగర్ స్ట్రీట్ నెం2లో నలుగురు యువకులు గంజాయి సేవిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నారు. గత కొంతకాలంగా గంజాయి సేవిస్తున్నామని, పరశురాం అనే వక్తి వద్ద కొనుగోలు చేస్తున్నామని విచారణలో తెలిపారు. శివకుమార్, పవన్‌కుమార్, హేమంత్, నందుల వద్ద 10 గ్రాముల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని గురువారం రిమాండ్‌కు తరలించామన్నారు. పరశురాం పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



సత్యానంద పాణిగ్రహి

మల్కాజిగిరి: వ్యక్తి అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కొండలు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశాకు చెందిన సత్యానంద పాణిగ్రహి(47) ఆర్టీసీకాలనీలో నివాసం ఉంటూ.. సెంట్రింగ్ పనిచేస్తున్నాడు. ఈనెల 19న తన అల్లుడు హేమరాజ్‌తో కలిసి కాంట్రాక్టర్ శివారెడ్డితో పనికివెళ్లాడు. 20న జెడ్‌టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద శివారెడ్డి బైక్‌పై ముగ్గురు జెడ్‌టీసీ క్రాస్‌రోడ్స్ వద్దకు వచ్చారు. ట్రాఫిక్ పోలీసులు ట్రిపుల్ రైడింగ్ వెళ్తే పట్టుకుంటారని, మొదట హేమరాజ్‌ను ఇంటి వద్ద దింపివస్తానని అక్కడే ఉండమని సత్యానందకు చెప్పాడు. తిరిగొచ్చిన శివారెడ్డికి సత్యానంద కనిపించలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో అతడి అల్లుడికి సమాచారం అందించాడు. హేమరాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవ వేడుకలు

మౌలాలి : డివిజన్ ప్రశాంత్‌నగర్ హెచ్‌బీ కాలనీలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయ 23వ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. గురువారం మేళతాళాలు, బాజాభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య విశ్వక్సేనఆరాధన, గోపూజ, పుణ్యహావచనం, ధ్వజారోహణం, అఖండ దీపారాధన, అష్టద్రవ్య మహాగణపతిహోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈనెల 24 వరకు మూడ్రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పైళ్ల బుచ్చిరెడ్డి ప్రకటించారు. అధ్యక్షుడు పైళ్ల బుచ్చిరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు లక్ష్మిరెడ్డి, కేబీ.ప్రసాద్, జితేందర్‌రావు, సంజీవరాణి, ప్రవీణ్, చంద్రమౌళి, జానయ్య, అశోక్‌గౌడ్, ప్రసాదరావు, విష్ణుమూర్తి, ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.



మహాలక్ష్మి అమ్మవారు

ప్రజా సమస్యలపై కార్పొరేటర్ల పర్యటన



పెంటారెడ్డి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, అధికారులు



నాచారంలో కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్

అల్వాల్: అల్వాల్ డివిజన్ పెంటారెడ్డి కాలనీలోని సమస్యలపై కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో డ్రైనేజీనీరు బయటకు వెళ్లకుండా పలు సమస్యలు ఎదురౌతున్నాయని, పాత డ్రైనేజీ లైన్ తీసివేసి కొత్తలైన్ వేయాలని కాలనీవాసులు విన్నవించారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కార్పొరేటర్ శాంతి అధికారులకు సూచించారు. జలమండలి మేనేజర్ కృష్ణమాచారి, శేఖర్, ఇమ్రాన్, కాలనీవాసులు వెంకటనారాయణ, శ్రీనివాస్, బాలరాజు, రామకృష్ణ, సాయికుమార్, సత్తమ్మ, ఆద్య, జయ, మల్లేశ్వరి, నాయకులు యాదగిరిగౌడ్, ప్రేమ్‌కుమార్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు సమస్యను పరిష్కరిస్తాం..

మల్లాపూర్: నాచారం జాన్సన్ గ్రామర్ స్కూల్ వద్ద వరద ముంపు సమస్యను పరిష్కరిస్తామని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. గురువారం నాచారంలో వరద ముంపు ప్రాంతాలను ఆమె అధికారులతో కలిసి పర్యటించారు. చిన్నపాటి వర్షానికి స్కూల్ వద్ద మోకాళ్ల లోతు నీరు నిలుస్తుందన్నారు. ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈఈ నాగేందర్, బాలకృష్ణ, ఏఈ కీర్తి, వినిత్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, స్థానిక నేతలు సాయిజెన్‌శేఖర్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షణికావేశంలో ప్రాణాలు కోల్పోయి..

- అర్ధాంతరంగా నిండు జీవితానికి ముగింపు
- 10 రోజుల్లో ఐదుగురి ఆత్మహత్య

ఉప్పల్: చిన్నపాటి కారణాలు, క్షణికావేశం, ఎదుటి వారిని చచ్చి సాధిద్దామనే ఆలోచనలతో నిండు నూరేళ్లు బతకాల్సిన వారు అర్ధాంతరంగా పాతిక, 30 ఏళ్లు పూర్తికాకముందే తనువు చాలిస్తున్నారు. ఆత్మహత్యలు చేసుకుని కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచుతున్నారు. వారితో ఒక్క క్షణం మాట్లాడితే చాలు ఆపద నుంచి బయటపడొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి వారికి ప్రత్యేకంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉందని భావిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..



ప్రవీణ్ కుమార్ (ఫైల్)

ఉప్పల్ బీరప్పగడ్డ ప్రాంతానికి చెందిన సుబ్బయ్యకు ఇద్దరు కుమారులు. కాగా పెద్ద కుమారుడు ప్రదీప్ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉండటంతో అతన్ని ఆసుపత్రిలో చేర్పించారు. కుమారుడి బాగోగులు చూసేందుకు తల్లి రోజూ ఆసుపత్రికి వెళ్లొచ్చేది. చిన్న కుమారుడు ప్రవీణ్‌కుమార్ (18)ఖాళీగా ఉండేవాడు. ఆమె 7న ఉదయం ఆసుపత్రికి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికొచ్చి తలుపు ఎంత తట్టినా తీయలేదు. అనుమానం వచ్చి స్థానికుల సాయంతో తలుపులు విరగొట్టి చూడగా.. అప్పటికే ప్రవీణ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. క్షణికావేశంలోనే ఉరేసుకుని మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు.

ఓ హోటల్‌లో మరో యువకుడు..



జగదీష్ (ఫైల్)

యాదగిరిగుట్ట ప్రాంతానికి చెందిన ఎర్ర జగదీష్ కుమార్ (23) సెల్ఫ్ డ్రైవ్ కార్ల వ్యాపారం చేసి అప్పులు కావడంతో 4న ఇంటి నుంచి పారిపోయి వచ్చి 8 రోజుల తర్వాత ఉప్పల్‌లోని న్యూ భరత్‌నగర్‌లోని ఓయో(సిగ్మా)లో 12న అద్దెకు తీసుకుని అదేరోజు హోటల్‌లోనే సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులు మిస్సింగ్ కేసు పెట్టారు. కేసు దర్యాప్తులో ఉండగానే ఈ ఘటన జరిగింది.

ఆర్థిక ఇబ్బందులతో కారు డ్రైవర్..



శ్రీను (ఫైల్)

ఆర్థిక ఇబ్బందులతో ఓ కారు డ్రైవర్ పురుగుల మందు తాగి అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్సపొందుతూ.. ఈనెల 15న మృతి చెందాడు. వరంగల్ స్టేషన్ ఘన్‌పూర్ చిన్న పెండ్యాల ప్రాంతానికి చెందిన బండి శ్రీను(20) కారు డ్రైవర్. కాగా అతడు బంజారాహిల్స్‌లో నివాసం ఉంటూ.. కారు డ్రైవింగ్ చేస్తూ కాలం గడిపేవాడు. గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్నాడు. ఇంట్లో వారికి చెప్పుకోలేని పరిస్థితి రావడంతో ఈనెల 12న ఉప్పల్ చౌరస్తాలోని ఎల్‌బీనగర్ బస్టాప్‌కు వచ్చి అక్కడే పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని మృతుడి సోదరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పదస్థితిలో పాల వ్యాపారి..



దేవేందర్ (ఫైల్)

పాలవ్యాపారి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉప్పల్ హరిజన బస్తీ ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన దేవేందర్ (40) వృత్తి పాల వ్యాపారం. కాగా 15న రాత్రి భోజనం చేసి ఉప్పల్ నల్లచెరువు కట్ట వద్ద సాయిబాబా దేవాలయం వెనకాల గేదెల దొడ్డికి పాలు తీసుకొచ్చేందుకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. రాత్రైనా రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుసార్లు ఫోన్‌చేసినా ఫలితం లేకపోవడంతో వెళ్లి చూశారు. అప్పటికే షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షించినా ఫలితం లేకుండా పోయింది. ముగ్గురు పిల్లలు, కుటుంబభారం ఇవన్నీ కలిపి ఒత్తిడికి గురి చేశాయని, వాటిని తట్టుకోలేకే ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు చెబుతున్నారు.

భార్యతో గొడవపడి..



కిషోర్ (ఫైల్)

మద్యం మత్తులో భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రకాశంజిల్లా గిద్దలూరు ప్రాంతానికి చెందిన ఎద్దుల కిషోర్(36) భార్య గౌతమితో పాటు ఉప్పల్ బీరప్పగడ్డ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. పదేళ్ల క్రితం వివాహం కాగా.. ఇద్దరు పిల్లలు కిషోర్ వృత్తిరీత్యా డ్రైవర్. గత కొన్నాళ్లుగా మద్యానికి బానిసై వచ్చినప్పుడల్లా భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో ఈనెల 17న మద్యం సేవించి భార్యతో గొడవపడటంతో ఆమె విసుగు చెంది, బీరప్పగడ్డలో నివాసం ఉంటున్న భర్త సోదరుడి ఇంటికి పిల్లలను తీసుకుని వెళ్లింది. సాయంత్రం వరకు భార్య రాకపోవడతో ఫోన్‌చేసి తాను చనిపోతున్నాని చెప్పి, ఫోన్‌కట్ చేశాడు. వెంటనే ఇరువురు ఇంటికి అక్కడికి చేరుకుని, తలుపులు కొట్టినా.. తీయలేదు. దీంతో పగులగొట్టి చూసేసరికే ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు.

కాసింతా భరోసా, చేయూతనిస్తే, కొత్త జీవితాన్ని చూస్తారు : స్వర్ణ, రోషిణి సంస్థ డైరెక్టర్

గతంలో కంటే ఈ రోజుల్లో ఆత్మహత్యలు చేసుకోవడానికి కారణాలు పెరిగాయి. భరించలేని ఒత్తిడి, మనలో ఉన్న శక్తిని తక్కువగా అంచనా వేసుకుంటారు. తమ సమస్యలు ఎవ్వరికీ చెప్పుకుందామన్నా.. చెప్పుకోలేని పరిస్థితి, ఆర్థిక పరమైన అంశాలు, విద్య, ఉద్యోగం, కుటుంబ సమస్యలు ఒత్తిళ్లు, తాము అనుకున్నది ఒకటైతే మరొటి అయ్యినప్పుడు మనస్సు అల్లకల్లోలానికి గురౌతుంది. అప్పటి నుంచి ఇక జీవితం చాలని చావే ఉత్తమమార్గంగా భావిస్తారు. ఇలాంటి సమస్యల్లో ఉన్న వారిని కుటుంబసభ్యులే గుర్తించి వారిని చేరదీసి ఇబ్బందులకు గల కారణాలను అడిగి తెలుసుకుంటే బయటపడ్డట్లే. ప్రతి రోజుకు 20- 25 వరకు కాల్స్ స్వీకరిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ స్వర్ణ తెలిపారు. కౌన్సెలింగ్ ద్వారా ఎంతో మందికి కొత్త జీవితాలను అందించినట్లు తెలిపారు. దాదాపుగా 70 మంది వాలంటీర్లు పని చేస్తున్నారని, ఎలాంటి సహాయంకైనా సిద్ధంగా ఉంటారన్నారు. సంప్రదించాల్సిన నంబర్లు 8142020033, 040-66202000.

మతిస్థిమితం లేని మహిళను చేరదీసి..

ఆశ్రమంలో చేర్పించిన పోలీసులు


ఉప్పల్: గత కొద్దిరోజులుగా ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో మతిస్థిమితం లేని యువతి తిరుగుతూ రాత్రుళ్లు ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తుండేది. స్థానికులు గమనించి రాచకొండ పోలీస్ కమిషనర్‌కు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు గురువారం పలు ప్రాంతాల్లో వెతకగా.. ఉప్పల్ గాంధీ విగ్రహం వద్ద కనిపించింది. దీంతో ఆమెను స్టేషన్‌కు తీసుకెళ్లి సపర్యలు చేయించారు. కొత్త బట్టలు ఇప్పించి, భోజనం పెట్టించారు. పోలీసులు విచారణ చేపట్టి ఆరా తీయగా.. ఆమె తనపేరు పద్మ అని చెప్పిందని, మరే విషయాన్ని చెప్పలేదని, తెలుగు, ఇంగ్లిష్ బాషల్లో మాట్లాడుతుందని పోలీసులు వివరించారు. సదరు మహిళను అబ్దుల్లాపూర్‌మెట్‌లోని అలేటి ఆశ్రమంలో చేర్పించారు. కుటుంబసభ్యులెవరైనా గుర్తిస్తే ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.



◆ ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాచకొండ కమిషనరేట్ మహిళలకు అత్యంత భద్రత కల్పిస్తోందన్నారు. స్థానికులు ఇలాంటి సున్నిత సమస్యలను వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

అల్వాల్: వెంకటాపురం డివిజన్ సత్యసాయికాలనీలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.45 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు పనులకు గురువారం కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెంకటాపురం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కాలనీవాసులు నర్సాగౌడ్, రాఘవేంద్ర, నాయకులు మోసిన్, జందర్, నర్సింగ్, మురళీగౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



సత్యసాయికాలనీలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిత